క్లుప్తంగా

చికెన్ దుకాణాలు తెరవొద్దు



కోవూరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో చికెన్ దుకాణాల యజమానులతో కోవూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్ శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఉన్న కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మూడ్రోజుల పాటు చికెన్ దుకాణాలు తెరవొద్దని సూచించారు. ఎవరైనా అతిక్రమించి చికెన్ అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మటన్ దుకాణాలు మాత్రం తెరవొచ్చని తెలిపారు. చికెన్‌ను తినొద్దని ప్రజలకు సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కోవూరు: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆదేశాల మేరకు పడుగుపాడు సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వాణి మాట్లాడుతూ ప్రభుత్వం 1987లో న్యాయ సేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందని తెలిపారు. ఈ చట్టం కింద ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి ప్రభుత్వం ఉచితంగా న్యాయసాయం అందజేస్తుందని వివరించారు. 2007లో వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం వృద్ధాప్యంలో సంతానం నుంచి నిరాదరణకు గురైన వృద్ధులు న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి న్యాయం పొందవచ్చని వివరించారు. బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం బాలుడికి 21 ఏళ్లు, బాలికకు 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు.

ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన అనిల్(29) అవివాహితుడు. వ్యసనాలకు బానిసవ్వడంతో అనారోగ్యానికి గురయ్యారు. తీవ్ర కడుపునొప్పి, వాంతులతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో ఇటీవల చేరారు. కుదుటపడని ఆరోగ్యం.. మరోవైపు వివాహం కాలేదనే మనస్తాపంతో ఆస్పత్రిలోని బాత్‌రూమ్‌లో గడ్డి మందును బుధవారం సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధి ముందు ఓడిన ఆశయం

- సెల్‌ఫోన్ షోరూమ్ ప్రారంభానికి సర్వం సిద్ధం చేసుకొని...
- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



నెల్లూరు రూరల్: తన కాళ్లపై తాను నిలదొక్కుకొని.. నలుగురికి ఉపాధి కల్పించాలనే ఉన్నతాశయంతో భారీ స్థాయిలో సెల్‌ఫోన్ షోరూమ్‌ను ఏర్పాటు చేయాలని యువకుడు సంకల్పించారు. షోరూమ్‌ను శుక్రవారం ప్రారంభించాల్సి ఉంది. ఈ క్రమంలో ఇంటీరియర్ డెకరేషన్ పనులను చేపట్టారు. అయితే విధి వక్రీకరించడంతో రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన విషాద ఘటన నెల్లూరు – ముత్తుకూరు రోడ్డుపై బాబానగర్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కావలికి చెందిన బొడ్డు భార్గవ్ (28) ధనలక్ష్మీపురంలో సెల్‌ఫోన్ షోరూమ్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. ఇంటీరియర్ డెకరేషన్ పనులను గురువారం చేపట్టారు. అనంతరం డెకరేషన్ చేసిన వ్యక్తిని నారాయణ ఆస్పత్రి సమీపంలోని ఓ ప్రాంతంలో వద్ద వదిలి తిరిగి ధనలక్ష్మీపురానికి బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి పడిపోయారు. తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబసభ్యులకు శుక్రవారం అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎం విశ్వకర్మ పథకంపై సెమినార్ నేడు

నెల్లూరు(దర్గామిట్ట): ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై సెమినార్‌ను ఏపీ టూరిజం హరిత హోటల్లో శనివారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని ఎమ్మెస్మెమ్‌ఈ కేంద్ర ప్రభుత్వ అసిస్టెంట్ డైరెక్టర్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేతివృత్తులు, హస్తకళల వారికి ఈ పథకంపై పలువురు ఉన్నతాధికారులు అవగాహన కల్పించనున్నారని వివరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి



మహిళకు గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న మంత్రి కాకాణి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మనుబోలులోని డీవీఆర్ కల్యాణ మండపం వద్ద వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి ఈ ఐదేళ్లలో గ్రామాల్లో కనిపిస్తుందన్నారు. అభివృద్ధి పనుల విషయంలో రాష్ట్రంలోనే అత్యధికంగా నిధులు ఖర్చు చేసిన నియోజకవర్గంగా సర్వేపల్లి నిలుస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో ఎక్కడా మట్టి రోడ్డు అనేది లేకుండా సీసీరోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. మనుబోలు పంచాయతీలోనే రూ.18.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.2.8 కోట్లతో సీసీ రోడ్లు, రూ.5.3 కోట్లతో డ్రెయిన్లు, రూ.3.65 కోట్లతో సచివాలయం, ఆర్‌బీకే, పీహెచ్‌సీ భవనాలు, నాడు–నేడు కింద రూ.80 లక్షలతో పాఠశాలల అభివృద్ధి, రూ.1.25 కోట్లతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జల జీవన్ మిషన్ కింద రూ.4.2 కోట్లు మంజూరు చేశామన్నారు. మనుబోలు మండలంలోని 1006 కుటుంబాలకు 1224 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించామని తెలిపారు. 862 ఎకరాల చుక్కల భూముల సమస్యకు విముక్తి కల్పించామన్నారు. తమ పాలనతో ప్రజలందరూ సంతోషంగా ఉంటే టీడీపీ నాయకులు మాత్రం బాధ పడిపోతున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనతో తమ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్న అక్కసుతోనే ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది వర్షాలు పడకుండా ఉంటే సాగునీటి సమస్యను అడ్డం పెట్టుకుని రైతులతో రాజకీయాలు చేద్దామనుకున్న సోమిరెడ్డికి నిరాశే ఎదురైందన్నారు. బండేపల్లి కాలువ జపం చేస్తున్న సోమిరెడ్డి ఐదేళ్లలో ఒక్క రూపాయి అయినా ఖర్చు చేశాడా అని ప్రశ్నించారు. బండేపల్లి కాలువ పరిధిలో ఒక్క సెంటు కూడా ఎండకుండా సాగునీరు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. ఐదేళ్ల కాలంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేశాం కాబట్టే మీ కుటుంబాలకు మేలు జరిగిందని భావిస్తేనే మాకు ఓటేయండి అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా అడగగలుగుతున్నారని అన్నారు. ఎంపీపీ వజ్రమ్మ, వైస్‌ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, చందన, సర్పంచ్ పద్మమ్మ, ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేశ్వరమ్మ, పార్టీ నాయకులు నారపరెడ్డి కిరణ్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, గుండాల ఆదినారాయణ, గుంజి రమేష్, దాసరి భాస్కర్‌గౌడ్, రవీంధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేంద్రవర్మ, సుబ్బారెడ్డి, దయాకర్, రమణయ్య, కోటేశ్వరగౌడ్ పాల్గొన్నారు.

అయోమయంలో ప్రతిపక్షాలు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా, ధీమాగా ఒంటరిగా ఎన్నికల బరిలో నిలుస్తుంటే ప్రతిపక్ష టీడీపీ మాత్రం అయోమయంలో ఉందన్నారు. ఎవరికి టికెట్ ఇవ్వాలో కూడా తెలియక బీజేపీ వస్తుందా.. జనసేనకు ఇవ్వాలా..కాంగ్రెస్ పరోక్షంగా సహకరిస్తుందా.. అని లెక్కలేసుకుంటూ చంద్రబాబు అయోమయంలో ఉన్నారన్నారు. సోమిరెడ్డి మాత్రం తనకు టికెట్ వస్తుందో.. లేదో తెలియకున్నా బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ కరపత్రాలు పట్టుకుని ఇంటింటికి తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. ఓ వైపు జేసీబీలు ఇప్పిస్తానంటూ జనాన్ని మభ్యపెట్టి తీసుకొచ్చి కండువాలు కప్పుతూ సిగ్గులేకుండా టీడీపీలో చేరే వారికి కండువాలు వేయలేక తనకు చేతులు నెప్పి పెడుతున్నాయని సోమిరెడ్డి గొప్పలు పోతున్నాడన్నారు. వారందరికీ తిరిగి కండువాలు వేయలేక తనకు చేతులు నెప్పి పెడుతున్నాయన్నారు. కరోనా కష్టకాలంలో సోమిరెడ్డి ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. మంత్రిగా ఉన్నప్పుడు సోమిరెడ్డి ఒక్క మహిళకు కూడా గ్యాస్ కనెక్షన్ ఇవ్వలేదని, తాను ప్రతిపక్షంలో ఉన్నా ఇప్పించానని తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలతో రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు.

ఘనంగా రథసప్తమి



ఇందుకూరుపేట: మండల ప్రజలు రథసప్తమి పర్వదినాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. మైపాడులోని కోదండరామస్వామి ఆలయంలో సూర్య భగవానుడికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సూర్య ప్రభ వాహనసేవ నిర్వహించారు. కోదండ రాముని ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : మండలంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ రఫీ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు చిట్టేపల్లి తిప్పవద్ద నిర్మించిన ఆర్‌బీకే భవనంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని చెప్పారు. మండల అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

కాంట్రాక్ట్ కూలీల ఆందోళన

పొదలకూరు : ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పొదలకూరు చిరుధాన్య పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కూలీలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. గత 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్న తమను రెగ్యులర్ లేబర్‌గా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్



కొడవలూరు: ఆరోగ్య సురక్ష శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

కొడవలూరు: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ అన్నారు. మండలంలోని రామాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి ఎంపీడీఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పేదలు చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తితే ఆస్పత్రులకు వెళ్లేందుకు జాప్యం చేస్తుంటారని, దానివల్ల ఆరోగ్య సమస్య తీవ్రమవుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవలు అందిస్తుందన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి చేయించే బాధ్యతను తీసుకుంటుందన్నారు. అనంతరం స్పెషలిస్ట్ వైద్యులు ప్రేమ్‌దీప్, శ్వేత, పీహెచ్‌సీ వైద్యులు కావ్య, లీలావతి 450 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పలువురికి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు చేయించేలా చర్యలు తీసుకున్నారు. ఈఓపీఆర్డీ వీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శి వగ్గు శీనయ్య, పీహెచ్‌ఎన్ విజయ, ఎంపీహెచ్‌ఈఓ కోటేష్, ఎంపీహెచ్‌ఎస్‌లు రజియ, సురేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు రజిత, జాస్మిన్, రోజ్‌మేరీ, సౌమ్య, ఏఎన్‌ఎంలు సుమతి, సుకన్య, మహేశ్వరి, సునీత పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యవంతం చేయాలి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి

వెంకటాచలం: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి వాటి అభివృద్ధికి కావాల్సిన అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని వీఎస్‌యూ రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి సూచించారు. వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని కంటేపల్లిలో శుక్రవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, విధానపరమైన విషయాలను అధ్యయనం చేశారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో రిజిస్ట్రార్ మాట్లాడారు. ఈ నెల 22వ తేదీ వరకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. వలంటీర్లు అన్ని అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో మౌళికసదుపాయల కల్పనకు చేయాల్సిన పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ సునీత, నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి, సర్పంచ్ సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



నార్తురాజుపాళెంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నేతలు

కొడవలూరు: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా మండలంలోని నార్తురాజుపాళెంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు పండించే పంటలకు స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర నిర్ణయించి అమలు చేసేలా పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు పీ దేవకుమారి, టీ నరసింహం, ఎస్డీ మహబూబ్‌బాషా, బీ.నాగమ్మ, ఎస్కే మహబూబ్‌బాషా, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



స్త్రీనిధి రుణాలపై అవగాహన కల్పిస్తున్న ఏజీఎం కామాక్షయ్య

కొడవలూరు: స్త్రీనిధి రుణాల పరిమితిని గణనీయంగా పెంచడం జరిగిందని, ఈ అవకాశాన్ని పొదుపు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో స్త్రీనిధి రుణాలపై పొదుపు సభ్యులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పొదుపు సభ్యురాలు వ్యక్తి గత రుణం కింద స్త్రీనిధి నుంచి రూ.50 వేల వరకు రుణం పొందవచ్చన్నారు. జీవనోపాధులకైతే ఒక్కో సభ్యురాలు రూ.లక్ష వరకు రుణం పొందవచ్చని చెప్పారు. రుణాల చెల్లింపులను సులభతరం చేస్తూ ఆటోమేటిక్ డెబిట్ విధానాన్ని నూతనంగా ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఏ సభ్యురాలు కూడా బ్యాంక్‌కు వెళ్లి రుణ వాయిదాలు చెల్లించాల్సిన అవసరం లేకుండా వారి పొదుపు ఖాతా నుంచే ప్రతి నెలా వాయిదా మొత్తం డెబిట్ కావడం జరుగుతుందన్నారు. వాయిదా తేదీ నాటికి పొదుపు ఖాతాల్లో ఆ మేరకు నగదు నిల్వ ఉండేలా చూసుకోవడం సభ్యుల బాధ్యతన్నారు. జీవనోపాధులకు ప్రోత్సాహకకరంగా రుణాలు అందిస్తున్నందున సభ్యులు సద్వినియోగం చేసుకుని జీవనోపాధులు మెరుగుపరచుకోవాలని కోరారు. ఏపీఎం ఎస్ రుక్మిణి, సీసీలు కే ఉదయ్‌కుమార్, మమత, శోభ, సుకన్య, శ్రీదేవి, వీఓఏలు పాల్గొన్నారు.

అబద్ధాలు, అభివృద్ధికి మధ్యే పోటీ



సీసీరోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రాబోయే ఎన్నికలు అబద్ధాలు, అభివృద్ధికి మధ్యే పోటీనని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వార్డుల్లో రూ.4.18 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు. రూ. కోటితో బైపాస్‌రోడ్డు నిర్మాణం, రూ.80 లక్షలతో బుచ్చిరెడ్డిపాళెం–చెన్నూరు రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రారంభించామన్నారు. వవ్వేరు–1లో రూ. 38లక్షలు, వవ్వేరు–2లో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయాలకు ప్రారంభోత్సవం చేశామని తెలిపారు. అలాగే 2,3,8,9,11, వార్డులలో రూ.55 లక్షలతో నిర్మించిన డ్రెయిన్లు, 2,3, 7,8,14,16,18,19 వార్డుల్లో నిర్మించిన 24 సిమెంట్‌రోడ్లను ప్రారంభించామని వివరించారు. అలాగే 15వ వార్డులో రూ.50 లక్షలతో నిర్మించిన డ్రెయిన్లు, 1,19 వార్డుల్లో రూ.23 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజలు విన్నవించిన వాటినన్ని చేశామని తెలిపారు.

సమాధానం చెప్పి చేర్చుకుంటే బాగుండేది

వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి రెండ్రోజుల క్రితం టీడీపీలో చేరిన బుచ్చిరెడ్డిపాళెం మండల నాయకులను వారిపై గతంలో లోకేశ్ చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పి పార్టీలో చేర్చుకుంటే బాగుండేదని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. గతంలో బుచ్చిరెడ్డిపాళెంలో లోకేశ్ బహిరంగ సభలో మాట్లాడుతూ సదరు నాయకులపై చేసిన ఆరోపణలు అన్నిఇన్ని కావన్నారు. వీటన్నింటికి వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీలో చేరిన వారిని ఒకటిన్నర సంవత్సరం నుంచే వైఎస్సార్‌సీపీ దూరంగా ఉంచిందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ దొడ్ల నిరంజన్‌బాబురెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పార్టీ మండల కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలి



పొదలకూరు: మందుల కిట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

పొదలకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. మండలంలోని బిరదవోలు సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. వైద్య సేవలు అందిస్తున్న తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులకు సూచనలు చేశారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రక్త పరీక్షలను పెంచాలని, సాధారణ పరీక్షలతో పాటు గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులు నిర్ధారణ అయితే వెంటనే జీజీహెచ్‌కు పంపాలని ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ వెంట వైద్యాధికారులు కిరణ్‌రిషిత, శ్రీకావ్య, ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

బుర్ర కథలతో సామాజిక చైతన్యం



మనుబోలులో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం



నార్తురాజుపాళెంలో ...

కొడవలూరు: బుర్ర కథల ద్వారా చిన్నారుల్లో సామాజిక చైతన్యం తీసుకొస్తున్నట్లు కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జ్యోతి తెలిపారు. మండలంలోని కొడవలూరు, నార్తురాజుపాళెం, యల్లాయపాళెం గిరిజన కాలనీల్లో శుక్రవారం కళాజాత నిర్వహించారు. బాల్యవివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక చట్టం, మహిళా చట్టాలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలపై రాజమండ్రికి చెందిన ఎం చిరంజీవి కళాజాత బృందం బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన కాలనీల్లోనే ఎక్కువగా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. ఆ కాలనీలే లక్ష్యంగా బుర్రకథ ద్వారా పిల్లలు, తల్లిదండ్రుల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. తద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏసీడీపీఓ అరుణ, ఐసీపీఎస్ డీసీపీఓ బీ సురేష్, పీఓ సీహెచ్ సమంత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీ నాగభూషణమ్మ, వీ పద్మావతి, ఎస్ నిర్మల పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మనుబోలు: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మనుబోలు సీఎం నగర్, చెర్లోపల్లి, కొండూరు సత్రాల్లో శుక్రవారం కళాజాత నిర్వహించారు. బాల్యవివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక చట్టం, మహిళా చట్టాలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర విషయాలపై రాజమండ్రికి చెందిన చిరంజీవి కళాజాత బృందం బుర్రకథ రూపంలో అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకులకు డాక్టరేట్



శ్రీధర్



సుప్రజ

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులు డాక్టరేట్లు అందుకున్నారు. గణిత శాస్త్ర అధ్యాపకుడు శ్యాంబట్ల శ్రీధర్ తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగాధిపతి వీ రమేష్‌బాబు పర్యవేక్షణలో 'సమ్ స్టడీస్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పెరిస్టాల్‌టిక్ ఫ్లోస్ ఆఫ్ ఫిజియాలజికల్ ఫ్లూయిడ్స్' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఇందుకు కర్నూలులోని రాయలసీమ వర్సిటీ శ్రీధర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసింది. అలాగే రసాయన శాస్త్ర అధ్యాపకురాలు బిల్లు సుప్రజ తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగాధిపతి ఎస్ వెంకటసుబ్బానాయుడు పర్యవేక్షణలో 'డెవలప్‌మెంట్ అండ్ వ్యాలిడేషన్ ఆఫ్ అనాలిటికల్ మేథాడ్స్ ఫర్ అనాలసిస్ ఆఫ్ పెస్టిసైడ్స్' అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించారు. ఇందుకుగానూ వర్సిటీ ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఇద్దరు అధ్యాపకులను కళాశాల చైర్మన్ పీ గుణశేఖర్, ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ శుక్రవారం శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.